క్లుప్తంగా

కలెక్టర్‌కు వినతి



నారాయణ పేట ఎడ్యుకేషన్: స్థానిక మున్సిపల్ పార్క్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె 12వ రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకుడు ఎల్లాగౌడ్ మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన వెంటనే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి వెంటనే వారికి ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. అనంతరం తమ న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ.. కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ ఎల్లాగౌడ్, అల్తాఫ్, గౌరమ్మ, మహేశ్వరి, సునీత, నారాయణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ



మద్దూరు: ప్రభుత్వం విద్యార్థులకు అందించే అల్పాహారం పంపిణీని మండలంలోని సోమవారం ప్రారంభించారు. హరేరామ హరే కృష్ణ ఫౌండేషన్ వారి సౌజన్యంతో అల్పాహారం ప్రతిరోజు పంపిణీ చేయనున్నారు. మండలంలోని 44ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలలోని 4,571మంది విద్యార్థులకు ప్రతి రోజూ అల్పాహారం అందనుందని ఎంపీఓ బాలకిష్టప్ప తెలిపారు. ప్రతి రోజూ మెనూ ప్రకారం ఉదయం వరకు అల్పాహారం పాఠశాలలకు చేరుతుందన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి



మాగనూర్: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆరవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం నాయకులు కోరారు. సోమవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్ఎం మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరంతరం ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌ని అన్నారు. కార్యక్రమంలో వెంకటస్వామి, రాఘవేంద్రచారి, వెంక్రటాములు, బాబురెడ్డి, విజయలక్ష్మి, అనిత, రవీంద్రమ్మ, సంధ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు పేట్ల పంపిణీ



మద్దూరు: కుమారుని జ్ఞాపకార్థం రెనివట్ల గ్రామానికి చెందిన సంగమ్మ వెంకట్‌రాములుచారి దంపతులు విద్యార్థులకు సోమవారం పేట్లను పంపిణీ చేశారు. రెనివట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంఈఓ బాలకిష్టప్ప హాజరయ్యారు. రెనివట్లకు చెందిన శివశంకర్ ఐదవ వర్ధంతిని పురస్కరించుకొని వారి తల్లిదండ్రులు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. హెచ్ఎం రాజునాయక్, గ్రామస్తులు శంకర్ పాల్గొన్నారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపిక

మక్తల్: సీఎం కప్ రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు పట్టణంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో చదువుతున్న భరత్‌కుమార్ ఎంపికైనట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలం సోమవారం స్థానిక విలేకరులకు తెలిపారు ఈ నెల 20న పట్టణంలోని బాలుర విభాగంలో నిర్వహించిన 10 కిలోమీటర్ల రోడ్ స్పీడ్ సైక్లింగ్ పోటీలో ఎంపికయ్యారు. వీరిని శిక్షణ కలెక్టర్ గరిమానురులా అభినందించారు. కార్యక్రమలలో కమిషన్ బోగేశ్వర్, విశ్రాంత పీఈటీ గోపాలం, ఉపాధ్యాయులు అభినందించారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

నారాయణ పేట టౌన్: పట్టణ సమీపంలోని సింగారం చౌరస్తాలో మక్తల్ వైపు నుంచి వచ్చే మిషన్ భగీరథ మంచినీటి మెయిన్ పైప్‌లైన్ మరమ్మతు కారణంగా పట్టణ ప్రజలకు రెండు రోజులపాటు నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని పుర కమిషనర్ సునిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు దీన్ని గమనించి సహకరించాలని కోరారు.

మెరుగైన సేవలు అందించాలి

- ఎస్పీ యోగేష్ గౌతమ్



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట: జిల్లా పరిధిలో శాంతి భద్రతపై భరోసా కల్పిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, అందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. పెండింగ్ కేసులు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ఇన్వెస్టిగేషన్‌తో పూర్తి పారదర్శకంగా చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో సీసీ టీవీల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలన్నారు. మహిళల భద్రతకు మరింత భరోసా కల్పిస్తూ వారి రక్షణ ప్రధాన ధ్యేయంగా నాణ్యమైన, సత్వర సేవలు అందించాన్నారు. సైబర్ క్రైం, డయల్ 100వాటి వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దొంగతనాలు జరగకుండా పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతీ రోజు డ్రంకెన్ డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ లింగయ్య, సీఐలు శివ శంకర్, చంద్రశేఖర్, రాజేందర్ రెడ్డి, రాంలాల్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, రాజు, రాం లాల్, రమేష్, రాము, భాగ్యలక్ష్మిరెడ్డి, నవీద్, కృష్ణం రాజు, వసంత, సునిత పాల్గొన్నారు.

భూ సమస్యలు కోర్టుద్వారానే పరిష్కరించుకోవాలి..

భూ తగదాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలని ఫిర్యాదుదారులకు ఎస్పీ సూచించారు. సోమవారం ప్రజావాణిలో భాగంగా వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను ఎస్పీ కార్యాలయంలో బాధితుల నుంచి ఆరు ఫిర్యాదులను స్వీకరించి వాటిని చట్టప్రకారం పరిశీలించాల్సిందిగా సీఐలు, ఎస్ఐలకు ఫోన్‌లో సూచించారు. బాధితులు తీసుకొచ్చే ఎలాంటి ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచొద్దని అధికారులకు ఆదేశించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందని ఎస్పీ సూచించారు. అత్యవసర సమయంలో డయల్ 100 లేదా 1930కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

అన్ని రంగాల్లో రాణించాలి



రమేష్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర ప్రతినిధులు

కోస్గి: యాదవులంతా ఏకతాటిపై ఉండి సంఘటితమైతేనే రాజకీయంగా, ఆర్థికంగా. సామాజికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించవచ్చునని రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్, జాతీయ ఉపాధ్యక్షుడు వెంకట నర్సయ్య అన్నారు. ఈ మేరకు అఖిల భారత యాదవ మహాసభ మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన యాదవ సభ సమావేశానికి ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ బాబు, వెంకటనర్సయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యాదవులంతా రాజకీయాలు పక్కనబెట్టి సంఘటితమై అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించాలన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గంటల రమేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా కావలి వెంకటయ్య, ఉపాధ్యక్షుడిగా ఆంజనేయులు, కొండప్ప, మహిపాల్, కో–శాధికారిగా రాములు, కార్యదర్శులుగా శ్రీనివాస్, మాదవులుతోపాటు పలువురిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అల్లాపురం నర్సింహులు, శ్రీనివాస్‌తోపాటు పలు గ్రామాల యాదవులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న హన్మేష్

కోస్గి రూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హన్మేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని మార్కెట్ కమిటీ ఆవరణలో జిల్లా మూడవ మహాసభలను చేపట్టారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలు ఇస్తూ వెట్టిచాకిరి చేయించుకుంటున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన మరుక్షణమే కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని ఏడాది గడుస్తున్నా ప్రభుత్వం నోరు విప్పడం లేదన్నారు. అంతకుముందు రామాలయం నుంచి శివాజీ చౌరస్తా వరకు ర్యాలీని చేపట్టారు. నాయకులు జయ, కిరణ్, నర్సింహులు, రాము, సుశాంత్ ఉన్నారు.

గర్భకోశ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మందులు పంపిణీ చేస్తున్న పశువైద్య సిబ్బంది

మాగనూర్: పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధుల పట్ల పశువుల యజమానులు అప్రమత్తంగా ఉండాలని మడల పశువైద్యాధికారి డాక్టర్ నరేందర్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని పుంజనూర్‌లో ఉచిత గర్భకోశ వ్యాధుల నివారణ చికిత్స కేంద్రం నిర్వహించారు. గ్రామంలోని పలువురు రైతులకు చెందిన పశువులకు డాక్టర్ ఉచితంగా టీకాలు వేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట: మద్దూరు మండల కేంద్రంలో హెచ్‌పీ గ్యాస్ గోదాంలో జరిగిన ప్రమాదంలో చనిపోయిన కార్మికుడి కుటుంబానికి రూ.50 లక్షలు, గాయపడ్డ వారికి రూ. 25లక్షలు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, అంజిలయ్యగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ జయసుధకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గుండెగారి దస్తప్ప, కనకప్ప, మహేష్, ఎం. దస్తప్ప రాములు, సాయిలు ఉన్నారు.

ఘనంగా రైతు దినోత్సవం



పేటలో రైతులను సన్మానిస్తున్న మార్కెట్ చైర్మన్ రాంపురం శివరెడ్డి



ఊట్కూరులో రైతులను సన్మానిస్తున్న మిల్లు యజమానులు

నారాయణపేట: జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంపురం శివరెడ్డి వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో రైతులకు సన్మానం చేశారు. అరుగాలం కష్టపడుతున్న రైతులందరికీ జాతీయ రైతు దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి భారతి, సూపర్‌వైజర్ లక్ష్మణ్, డైరెక్టర్ శరణప్ప, రైతులు పాల్గొన్నారు.

ఊట్కూరు: జాతీయ రైతుల దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని గ్రామ శివారులోని విజయ్‌కాటన్ ఇండస్ట్రీలో మిల్లు యజమానులు రైతులను సన్మానించారు. కార్యక్రమంలో మిల్లు యజమాని రైతులు కిశోర్‌జైన్, వెంకట్‌రెడ్డి, బసిరెడ్డి, వెంకటప్ప, లక్ష్మీ, పద్మ పాల్గొన్నారు.

ఆకలి తీర్చే దేవుళ్లు రైతన్నలు..

కోస్గి రూరల్: ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలుస్తూ ప్రపంచానికి ఆకలి తీర్చుతున్న రైతులను ఆకలి తీర్చే దేవుళ్లుగా గుర్తించాల్సిన అవసరం ఉందని జీవశాస్త్ర ఉపాధ్యాయుడు వార్ల మల్లేషం అన్నారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా మండలంలోని మీర్జాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. అనంతర విద్యార్థులు వారి పంటపొలాల వద్ద కలుసుకుని మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకట్రామిరెడ్డి ఉన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

మరికల్: మండలంలోని విద్యార్థులు రైతుల వేషాధారణలతో చక్కటి ప్రదర్శన చేశారు. స్థానిక చౌరస్తాలో విద్యార్థులు రైతుల కష్టాలను కళ్లకు కట్టినట్లు పాటల రూపంలో నృత్యాలు చేస్తూ చూపించారు. రైతుల ప్రదర్శన గ్రామస్తులను ఆకట్టుకోవడంతో వారిని అభినందించారు.

వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన విద్యార్థులు

కృష్ణా: మండలంలోని ముడుమాల్‌లో వ్యవసాయ క్షేత్రాలను విద్యార్థులు సందర్శించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులకు రైతులు పంటలు పండించేందుకు తీసుకుంటున్న చర్యలు, వారి కష్టాలను ప్రత్యక్షంగా చూయించారు.

తపస్ జిల్లా కార్యదర్శిగా అంజిలయ్య

కోస్గి: పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మన్నె అంజిలయ్య తపస్ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. తపస్‌లో చురుకైన పాత్ర పోషిస్తూ వివిధ స్థాయిల్లో బాధ్యతలు నిర్వహించిన అంజిలయ్యను జిల్లా కార్యదర్శిగా నియమించడంపై ఆ సంఘం కోస్గి, గుండుమాల్ మండలాల అధ్యక్షులు వెంకటేష్, వెంకట్రాములుతోపాటు పలువురు హర్షం వ్యక్తం చేశారు. సంఘం బలోపేతం కోసం తనవంతు కృషిచేస్తానని తెలిపారు.

ఎంఎంఎస్ అధ్యక్షురాలిగా గోవిందమ్మ ఎన్నిక

నారాయణపేట: మండల మహిళా సమాఖ్య స్థానిక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల జనరల్ బాడీ సమావేశంలో మండల మహిళ సమాఖ్య నూతన మండల అధ్యక్షురాలిగా అభంగపూర్‌కు చెందిన గోవిందమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలిగా లక్ష్మి, కార్యదర్శిగా కమ్లి బాయి, సహాయ కార్యదర్శిగా బాలమణి, పద్మను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎం గోపాల్, సీసీలు వసంత, నర్సింహులు, కుర్మయ్య పాల్గొన్నారు.

ఎంపీఓల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

మరికల్: నారాయణపేట ఎంపీఓల జిల్లా కమిటీని సోమవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ అధ్యక్షుడిగా ఎంఎల్ఎన్ రాజు, ఉపాధ్యక్షుడిగా రామన్న, ప్రధాన కార్యదర్శిగా బాలజీ, వెంకటేశ్వర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వివిధ మండలాల ఎంపీఓలు పాల్గొన్నారు.

మ్యాథ్స్ టాలెంట్ టెస్టులో ప్రతిభ



మద్దూరు: శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని రామేశ్వరమ్మ ఎడ్యుకేషనల్ సోసైటీ వారు మహబూబ్‌నగర్‌లోని కమల గార్డెన్‌లో నిర్వహించిన మ్యాథ్స్ టాలెంట్ టెస్టులో మద్దూరుకు చెందిన గీతాంజలి ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని 112పాఠశాలల నుంచి 3,500 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన వారిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వెంకటయ్య పాల్గొన్నారు.

మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్టు

కోస్గి రూరల్: తెలంగాణ బయోసైన్స్ ఫోరం ఆధ్వర్యంలో చేపట్టిన మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్టు పోటీలను సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించినట్లు హెచ్ఎం శివరాములు అన్నారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిభ పరీక్షలలో పాల్గొనడం ద్వారా తమ నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చన్నారు. మండల స్థాయిలో తెలుగు విభాగంలో ప్రథమ స్థాయిలో కావేరి, ద్వితీయ స్థానంలో శివలిలా, ఆంగ్ల విభాగంలో విష్ణుప్రియ నిలిచారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునిత, రవీందర్, శ్రీనివాస్, శకుంతల ప్రవీణ్, రాజేందర్‌రావు ఉన్నారు.



సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



తిప్పరాస్‌పల్లిలో సర్వేను పరిశీలిస్తున్న శిక్షణ కలెక్టర్ గరిమానురులా



దోరెపల్లిలో ఇందిరమ్మ ఇళ్లను సర్వే చేస్తున్న అధికారులు

ఊట్కూరు: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని శిక్షణ కలెక్టర్ గరిమానూరులా అన్నారు. సోమవారం మండలంలోని మల్లెపల్లి, తిప్పరాస్‌పల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఇంటింటికి తిరిగి ఇంటి యజమానులను కలిసి పూర్తిస్థాయిలో సర్వే చేపట్టాలని అన్నారు. మండలంలో ఇప్పటి వరకు ఎన్ని ఇళ్లు సర్వే పూర్తయిందని అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. లబ్ధిదారులు ప్రతి ఒక్కరిని కలిసి త్వరితగతిన సర్వేను పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్, టీపీ గోపాల్ పాల్గొన్నారు.

సర్వేలో అర్హులను గుర్తించాలి

మద్దూరు: మండలపరిదిలోని దోరెపల్లి గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను నియోజకవర్గ ప్రత్యేక అధికారి మొగులప్ప సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా అర్హులను గుర్తించాలని సూచించారు. మండలంలోని ప్రతి గ్రామంలో గిరిజన తాండాల్లో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎంపీడీఓ నర్సింహారెడ్డి, ఎంపీఓ రామన్న, పంచాయతీ కార్యదర్శి రాజయ్య పాల్గొన్నారు.

రైతు కూలీలకు పరిహారం చెల్లించాలి



రైతు కూలీ సంఘం నాయకులు

నారాయణ పేట టౌన్: ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు ఏట రూ.12వేలు జీవన పరిహారం ఇస్తామన్నా హామీని అమలుచేయాలని వామపక్ష రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్‌చేశారు. సోమవారం రైతు కూలీల సమస్యలపై కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సలీం మాట్లాడుతూ.. కేవలం దినసరి కూలీపై జీవనం సాగించే నిరుపేదలకు ఒకే విడతలో పరిహారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, బి.యాదగిరి, జి.వెంకట్‌రాములు, సుభాష్ పాల్గొన్నారు.

బాలల హక్కులు, చట్టాలపై అవగాహన



ఇటుక బట్టి కూలీలతో మాట్లాడుతున్న అధికారి కవిత

మక్తల్: బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే యజమానులపై చర్యలుంటాయని జిల్లా లీగల్ ఆఫీసర్ కవిత అన్నారు. సోమవారం పట్టణంలోని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఇటుక బట్టీల వద్ద బాలల హ క్కులు, చట్టాలపై అవగాహన నిర్వహించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఆడపిల్లలు మధ్యలోనే చదువు మానేయకుండా చూడటం, బాల్యవివాహాల ను నిరోధించడం గ్రామాల్లో బాల్యవివాహాలు జరిగితే 1098 నంబర్‌కు చేయాలని కోరారు. అనంతరం బాలల హక్కులు, పోక్సో చట్టం, బాల్యవివాహాలపై వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ విద్యవాణి, బాల్‌రాజు, లీగల్ అడ్వయిజర్ కవిత, కార్మికులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

దామరగిద్ద: దేశవ్యాప్త రైతుల పక్షాన మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని నిరహార దీక్ష చేపట్టిన రైతు నేత జగ్జీత్‌సింగ్ దల్లేవల్ ఆరోగ్యంపై ప్రభుత్వం చొరవ చూపాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గోపాల్, అంజిలయ్యగౌడ్ అన్నారు. రైతు దినోత్సవం సందర్భంగా 27 రోజులుగా నిరహార దీక్ష ఉన్న 70 ఏళ్ల వృద్ధుడి పోరాటానికి ప్రభుత్వం గుర్తించక పోవడం సోచనీయమన్నారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, రైతులు పాల్గొన్నారు. అలాగే రైతు నేత జగ్జీత్‌సింగ్ దల్లేవల్ డిమాండ్‌లను పరిష్కరించి నిరహార దీక్షను విరమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతు సంఘం మండల అధ్యక్షుడు తాయప్ప డిమాండ్ చేశారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ



చీరలను పంపిణీ చేస్తున్న శ్యాంసుందర్

అమరచింత: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరుపేద క్రైస్తవ మహిళలకు సోమవారం చీరలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఈ శ్యాంసుందర్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా కేవీపీఎస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఇందులో భాగంగానే క్రిస్మస్ పండుగ రోజు పేద క్రైస్తవ మహిళలు నూతన వస్త్రాలు లేక సంతోషానికి దూరం కాకూడదనే ఉద్దేశ్యంలో వారం దరికీ చీరలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అమరచింత పట్టణంలోని మహిళలకే కాకుండా మండలంలోని ఆయా గ్రామాల్లోని నిరుపేదలకు చీరలను అందిస్తున్నామన్నారు. హ్యాపీపాల్, కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ పాల్గొన్నారు.

గణితం అంటే భయం వద్దు



కృష్ణాలో గణిత కృత్యాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కోస్గి రూరల్: అన్ని శాస్త్రాలకు మూలం గణితమని గణితం అంటే భయం వీడాలని హెచ్ఎం శివరాములు అన్నారు. సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు గణిత ఉపకరణలు విద్యార్థులు తయారుచేసి ప్రదర్శించారు. అనంతరం వివిధ అంశాలలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, శ్రీకాంత్, సబిత, వసంత, అర్చన తదితరులు ఉన్నారు.

కృష్ణా: మండలంలోని ముడుమాల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. విద్యార్థులు తమ నిత్య జీవితంలో తమ కుటుంబంలో జరిగే గణిత క్రియలను కొన్నింటిని వారు కృత్యాల ద్వారా ప్రదర్శించారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులు తయారు చేసిన వాటికి బహుమతులు అందించి వారిని అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం శేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



కోస్గిలో గణిత ఫార్ములాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు